క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరణ

వీణవంక: వీణవంక తహసీల్దార్‌గా లక్ష్మణ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ తిర్మల్‌రావును ఇటీవల కలెక్టర్ సస్పెండ్ చేశారు. దీంతో డీటీ నిజామొద్దీన్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగారు. వరంగల్ జిల్లా నుంచి లక్ష్మణ్‌ను వీణవంకకు పంపించారు. వీణవంక మండలం సమస్యాత్మక మండలంగా జిల్లాలోనే మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ అధికారులు పని చేయడానికి విముఖత చూపుతున్నట్లు తెలిసింది. ఇటీవల తహసీల్దార్ కార్యాలయంలో నెలకొన్న వివాదాలపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితం కావడం, కలెక్టర్ స్పందించి అటెండర్ నుంచి ఆర్‌ఐల వరకు 12మందిని బదిలీ చేయడం సంచలనమైంది.

నియామకం


కాంపల్లి రాజు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన కాంపెల్లి రాజు బహుజన సమాజ్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియామకమయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీపీఐ బొమ్మనపల్లి గ్రామ కార్యదర్శిగా సంపత్


అందె సంపత్

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామ సీపీఐ కార్యదర్శిగా అందె సంపత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో బి. తిరుపతిగౌడ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో నూతన కార్యదర్శిని ఎన్నుకున్నట్లు మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి తెలిపారు. సహాయకార్యదర్శిగా కుందేళ్ల వెంకటయ్య, కోశాధికారిగా బండారుపల్లి తిరుపతిని ఎంపిక చేశామన్నారు. అలాగే గ్రామ ఏఐవైఎఫ్ అధ్యక్షుడిగా మిట్టపెల్లి దిలీప్, ఏఐఎస్ఎఫ్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా తాళ్ల అవినాశ్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడిగా కాంపెల్లి రాజయ్య ఎంపికయ్యారని వివరించారు. ముఖ్యకార్యకర్తల సమావేశానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటువేయాలని నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని కోరారు.

ఉగాది పురస్కారం అందజేత

చొప్పదండి: చొప్పదండికి చెందిన కవి, రచయిత ఛత్రపతి శ్రీనివాస్ ఉగాది పురస్కారం అందుకున్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, మహేశ్‌చంద్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పురస్కారం ప్రకటించి హైదరాబాద్‌లో అందజేశారు. కార్యక్రమంలో సినిమా దర్శకులు వీరశంకర్, చంద్రమహేశ్, రాజా వన్నెంరెడ్డి, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీనివాస్ పినాకిని సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ సభకు తరలిన జనం

వీణవంక: జమ్మికుంటలో కాంగ్రెస్ సభకు మండలం నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. ఐదు రోజులుగా రికార్డు స్థాయిలో 44 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాఎండను లెక్కచేయకుండా సభకు తరలివెళ్లడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొంది. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత తొలిసారి జమ్మికుంటకు వస్తుండటంతో కార్యకర్తలు భారీ సంఖ్యలో జనాన్ని సమీకరించారు. సభకు తరలివెళ్లినవారిలో పార్టీ సీనియర్ నాయకులు ఎండీ సాహెబ్‌హుస్సేన్, ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, పంజాల సతీశ్‌గౌడ్, మాసాడి చొక్కరావు, జీడి దేవందర్‌రెడ్డి, చాడ రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డీఎస్పీతోనే అన్నివర్గాలకు మేలు

మానకొండూర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంపీ ఎన్నికల్లో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, కరీంనగర్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి చిలువేరు శ్రీకాంత్ కోరారు. మానకొండూర్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా ధర్మ సమాజ్ పార్టీ కరపత్రాలను ఆవిష్కరించారు. దేశంలో పార్లమెంట్ యుద్ధం ప్రారంభమైందని, పదిశాతం ఉన్న అగ్రకులాలు 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఎరవేస్తూ రాజ్యాధికారం చేపడుతున్నారని, రాజ్యాధికారం ఎస్సీ, ఎస్టీ, బీసీల చేతుల్లోకి వస్తేనే దేశం బాగుపడుతుందని, అన్నివర్గాలకు మేలు జరుగుతుందని వివరించారు. బీసీ ఎస్సీ, ఎస్టీల కోసమే డీఎస్పీ ఆవిర్భవించిందన్నారు. కరీంనగర్ ఎంపీగా పోటీ చేస్తున్నానని ఓటేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జీ రాసపురి రాజేంద్రప్రసాద్, జిల్లా కోశాధికారి బాబు, నరేష్, శ్రీకాంత్, మల్లికార్జున్, ప్రశాంత్, లక్ష్మణ్, శివాజీపాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సొంత గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దుర్గం రాజేశం, నిష్యాంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో సర్కారీ స్కూళ్ల హవా

చొప్పదండి: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరుగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. మండలంలోని రుక్మాపూర్ మాడల్ స్కూల్, కాట్నపల్లి, గుమ్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. చొప్పదండిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎలిగేటి సవిత, గొపెల్లి అక్షిత, మాడల్ స్కూల్‌కు చెందిన ఏగోలపు చరణ్, వీణాధరికి చెందిన హర్షవర్ధన్, కృష్ణవేణి పాఠశాలకు చెందిన కె. అక్షితలు పది జీపీఏ సాధించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు 93.19 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

రామడుగు: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని వెలిచాల జెడ్పీహెచ్ఎస్ వందశాతం ఉత్తీర్ణత సాధించింది. విద్యార్థులు ఎం. వివేక్ 8.8, రాజా 8.5 జీపీఏ సాధించినట్లు హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు. విద్యార్థులను మాజీ సర్పంచ్ కాడె శంకర్ అభినందించారు. ఉపాధ్యాయులు పద్మలతాదేవి. రామస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, రమేష్, క్రిష్ణవేణి, సజిత, రమణారెడ్డి, రమేశ్‌లు పాల్గొన్నారు. రామడుగు, గుండి, గోపాల్‌రావుపేట, రుద్రారం, దేశరాజ్‌పల్లి, వెలిచాల, వెదిర, జిల్లా పరిషత్తు పాఠశాలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో 99 శాతం ఉత్తీర్ణత నమోదైందని మండల విద్యాధికారి వేణుకుమార్ తెలిపారు. 508 మంది పరీక్షలకు హాజరుకాగా 285 బాలురు, 223 బాలికలు ఉత్తీర్ణత సాధించగా ఐదుగురు ఫెయిలయ్యారని తెలిపారు.

గంగాధర: మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మండలంలో 682 మంది పరీక్షలకు హాజరు కాగా 679 మంది ఉత్తీర్ణులయ్యారు. 27 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించినట్లు ఎంఈవో వేణుకుమార్ తెలిపారు. గంగాధర, కురిక్యాల, కేజీబీవీ విద్యార్థులు మినహా మల్లాపూర్, బూర్గుపల్లి గర్శకుర్తి, ఉప్పరమల్యాల, గట్టుభూత్కూర్,ఒద్యారం, మోడల్‌స్కూల్, తెలంగాణ మైనారిటీ, మహాత్మాజ్యోతిబాపూలే బాల, బాలికల స్కూళ్లు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. మండలంలోని న్యాలకొండన్నపల్లి శివారులోని మోడల్‌స్కూల్ తొమ్మిదేళ్లుగా వందశాతం ఉత్తీర్ణత సాధించగా నిన్నటి ఫలితాల్లో ఆరుగురు పది జీపీఏ సాధించారు.

హుజూరాబాద్: పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 249 మంది విద్యార్థులకు 227 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాధికారి కేతిరి వెంకట నర్సింహారెడ్డి తెలిపారు. కనుకుల గిద్దె, సింగాపూర్, రాంపూర్, కందుగుల, పెద్దపాపయ్యపల్లి గ్రామాల్లోని విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్ విద్యార్థులు 95మంది పరీక్షలకు హాజరు కాగా 92 మంది ఉత్తీర్ణత సాధించారు. కిష్టంపేట గ్రామానికి చెందిన చిలగాని శివగణేశ్ 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచారు. పచ్చిమట్ల ఆకాంక్ష 9.7 జీపీఏతో రెండో స్థానం, గాజుల సమిలిత 9.5, గెల్లు మల్లికార్జున్ 9.5 జీపీఏ సాధించారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు. మండలంలో 287మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 262 మంది 91.3శాతంతో సత్తాచాటారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ అభినందించారు.

ఇల్లందకుంట: మండలంలోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల నుంచి 145 మంది పరీక్షలకు హాజరు కాగా 132 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీ నుంచి 9.7జీపీఏతో బి. శ్రీదేవి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ... వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వం పాఠశాలలను మరింత బలోపేతం చేసి ఉత్తమ ఫలితాలకు కృషి చేస్తామన్నారు. అనంతరం పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు.

మానకొండూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 89.91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి మధుసూదనాచారి తెలిపారు. దేవంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మానకొండూర్ ప్రభుత్వ పాఠశాలలో 426 మంది విద్యార్థులకు 383 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని పచ్చునూర్ ఉన్నత పాఠశాల నుంచి కె. సృజన 9.8 ఉత్తీర్ణత సాదించగా, పోచంపల్లి మోడల్ స్కూల్ నుంచి 3, దేవంపల్లి గురుకుల నుంచి ఒక విద్యార్థి 9.8 ఉత్తీర్ణత సాధించింది.


చొప్పదండి: ఏగోలపు చరణ్‌ను(10 జీపీఏ) అభినందిస్తున్న మాడల్ స్కూల్ యాజమాన్యం


రామడుగు: విద్యార్థులను అభినందిస్తున్న మాజీ సర్పంచ్ కాడె శంకర్, ఉపాధ్యాయులు


ఎలిగేటి స్రవంతి


గొపెల్లి అక్షిత


పచ్చిమట్ల ఆకాంక్ష


బి. శ్రీదేవి

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతు మృతి

చొప్పదండి: మండలంలోని రాగంపేట పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలోని వడ్ల కుప్ప వద్ద రైతు ఐతరవేని రాజేశం(47) వడదెబ్బతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మంగళవారం పరామర్శించారు. రైతు మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలని, లేదంటే ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే అవకాశం ఉందని, లారీల కొరత లేకుండా చూడాలని సూచించారు. వెంట బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, తదితరులున్నారు.


రైతు మృతదేహం వద్ద కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

తాగునీటి సరఫరా పరిశీలన

రామడుగు: మండల కేంద్రంలో ఎంపీడీవో రాజేశ్వరి(రామడుగు ప్రత్యేకాధికారి) మంగళవారం తాగునీటి సరఫరాను పరిశీలించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ తాగునీటి సరఫరా ఏలా ఉంది, ఏమైనా ఇబ్బందులున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బందిలేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

దళితులకు క్షమాపణ చెప్పాలి

మానకొండూర్: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు కవ్వంపల్లి ప్రకాశ్ దళితులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ మంగళవారం డిమాండ్ చేశారు. మానకొండూర్‌లో బీఆర్ఎస్ దళిత నాయకులతో కలిసి మాట్లాడారు. ప్రకాశ్ దళిత నాయకుడై దళితులను కించపరిచే విధంగా మాట్లాడటం సిగ్గు చేటని, దళితులకు క్షమాపణ చెప్పకపోతే నియోజకవర్గంలో తిరగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో లింగాల లక్ష్మణ్, ఎనగందుల సుదర్శన్, కనుకుంట్ల అభిలాశ్, వంతడ్పుల సంపత్, సంగుపట్ల మల్లేశం, వడ్లూరి శంకర్, ఇస్కూల్ల అంజయ్య, ఎలుక దేవయ్య, దుర్గ సుదర్శన్, బొజ్జ కోటి లింగం, కొమ్ము సంపత్, డప్పు తిరుపతి పాల్గొన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలను విస్మరించింది

హుజూరాబాద్: బీసీలు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలని బీసీ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమాన్ని బీజేపీ గాలికి వదిలేసిందని, రాజ్యాంగాన్ని రద్దు చేసి ప్రజల హక్కులను కాలరాసేందుకు సిద్ధమవుతున్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ఏనాడు బీసీల తరపున ఉద్యమించిన దాఖలాలు లేవని, ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదన్నారు. బీసీ రాజకీయ పోరాట సమితి అసెంబ్లీ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు పడాల తిరుపతి, సతీశ్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని సీఎంకు వినతి


సీఎం రేవంత్‌రెడ్డితో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ స్వప్న

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి తెలిపారు. అలాగే మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి స్థానిక సమస్యలు, పట్టణంలో భూ కబ్జాలపై విచారణ చేపట్టాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామానికి అడ్వకేట్ సంజీవరెడ్డి సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

బ్రిడ్జి ఏర్పాటు చేయాలని వినతి

గన్నేరువరం: గన్నేరువరం నుంచి కరీంనగర్ వరకు మానేరు నదిపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని బ్రిడ్జి జేఏసీ అధ్యక్షుడు సంపతి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బ్రిడ్జి నిర్మిస్తే బెజ్జంకి, ఇల్లంతకుంట, గన్నేరువరం మండలాల్లోని గ్రామాల ప్రజలకు కరీంనగర్ దగ్గర అవుతుందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీనిపై బండి సంజయ్ సానుకూలంగా స్పందించారని, బ్రిడ్జి వేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అప్రూవల్ ఇవ్వలేదని ఇస్తే బ్రిడ్జి నిర్మాణం చేపట్టేవాళ్లమని సంజయ్ తెలిపారని అన్నారు. ఎలక్షన్ కోడు ముగియగానే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జి మంజూరు చేయిస్తామన్నారని తెలిపారు.

ఉద్యోగులు మంచి గుర్తింపు తెచ్చుకోవాలి

మానకొండూర్: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని, సమాజానికి సేవ చేసే అదృష్టం ప్రభుత్వ ఉద్యోగులకు రావడం గొప్ప విషయమని ఎస్సారెస్పీ సర్కిల్ 2 ఎస్ఈ శివకుమార్ అన్నారు. మానకొండూర్ ఎస్సారెస్పీ కార్యాలయంలో వర్క్ఇన్‌స్పెక్టర్ తుల వెంకటేశం పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. కార్యాలయ ఉద్యోగులు పూలమాలలు, పుష్పగుచ్ఛం, శాలువాలతో వెంకటేశంను సన్మానించారు. కార్యక్రమంలో ఈఈ నాగభూషణం డీఈ వేణుగోపాల్, శ్రీనివాస్, జేఈ సునంద, ఎస్ మనోహర్, ఎన్ నాగరాజు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో అన్నపూర్ణ ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఎరువు బస్తాల వివరాలతో పాటుగా రికార్డులను పరిశీలించారు. ప్రతి షాపు యాజమాని ఎరువుల వివరాలతో కూడిన రికార్డులను సక్రమంగా నిర్వహణ చేయాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అల్ఫోర్స్ విద్యార్థుల విజయకేతనం



విజయ సంకేతం చూపుతున్న చైర్మన్ నరేందర్ రెడ్డి, విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్రలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారని విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని టైనీటాట్స్‌లో విద్యార్థులను మంగళవారం అభినందించారు. మొత్తం 135 మంది 10 జీపీఏ, 139 మంది 9.8, 113 మంది 9.7 జీపీఏ, 747 మంది 9 జీపీఏ, ఆపైన సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఒక ప్రణాళికతో విద్యనందిస్తున్నట్లు, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల వల్లే అల్ఫోర్స్ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ప్రిన్సిపాళ్లు, టీచర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

జమ్మికుంట: వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ప్రశ్నించే బీఆర్ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలని ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వావిలాలలో రోడ్ షో ప్రచారం నిర్వహించారు. హామీలను నెరవేర్చలేని పార్టీకి ఎందుకు ఓటు వేయాలని, బండి సంజయ్ ఎంపీగా ఉండి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ఆరోపించారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్వనాశనం చేస్తున్నాందన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోకుంటే ఆంధ్రాలోని చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రెండు రాష్ట్రాలను ఒకటి చేసే ప్రమాదం ఉందని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో గెల్లు శ్రీనివాస్, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, ఎంపీటీసీ మల్లేశంతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రోడ్‌షోలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కరపత్రం ఆవిష్కరణ

హుజూరాబాద్: పట్టణంలోని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు సంబంధించిన వెబ్ పోర్టల్‌ను బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టు న్యాయవాదుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వెబ్ సైట్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ సంస్థ ఈ వెబ్ పోర్టల్‌ను రూపొందించింది. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఎస్ఐటీ సీఈవోలు భానుచందర్, శారద, న్యాయవాదులు చెంగల్వ కళ్యాణ్‌రావు, లలితారెడ్డి, చంద్రశేఖర్‌రావు, లక్ష్మణ్, గంగా, పద్మిని, అమృత్‌రావు, విశ్వేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

జమ్మికుంటలో కాంగ్రెస్ పార్టీ జనజాతర సభ దృష్ట్యా పోలీసులు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, పీవీ జిల్లా సాధన సమితి నాయకుడు వేల్పుల రత్నం, బీఆర్ఎస్ నాయకుడు మోరె మధును పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో ఉన్న నాయకులను బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, ఎలాంటి తప్పు చేయకున్నా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేయడం, అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. వీరి వెంట మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆరు గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

వీణవంక: ఆరు గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందని, ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదని, మాట మీద నిలబడని కాంగ్రెస్ పార్టీని ఎంపీ ఎన్నికల్లో బొంద పెట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. వీణవంక మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ. రూ.500 బోనస్, ఎకరాకు రూ.15వేలు, రైతుభరోసా, రెండు లక్షల రుణమాఫీకి ఎగనామం పెట్టారని ధ్వజమెత్తారు. తాలు, తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతుల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆదిరెడ్డి, సీనియర్ నాయకులు, అసెంబ్లీ కన్వీనర్ గౌతంరెడ్డి, ఉన్నారు.

శంకరపట్నం: దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీని గెలిపించాలని, మోదీకి మూడోసారి ప్రధాని అవకాశం ఇవ్వాలని కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగట్టులో ఉపాధి కూలీలతో మాట్లాడారు. . నాయకులు అనిల్, వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, నరేందర్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.


వీణవంక: మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

రామడుగు: మండలంలోని ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు రవీందర్, అంజిబాబు, శ్రీనివాసాచారి, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్, రాం, లక్ష్మణ్, జయంత్, పలువురు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కమలం పువ్వు గుర్తుకే ఓటువేయాలని అభ్యర్థించారు. బీజేపీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సతీష్, మండల కార్యదర్శి శ్రీనివాస్, రమేశ్, రమాకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఆంటకం కలుగకుండా దళితబంధు సాధన సమితి సభ్యులు కొలుగూరి సురేశ్, మంద రాజేశ్‌ను సోమవారం రాత్రి ముందస్తుగా అరెస్ట్ చేసి సైదాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు దళితబంధు సాధన సమితి సభ్యులు మంగళవారం తెలిపారు. రెండో విడుత దళితబంధు నిధులు మంజూరు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల జీవితాలతో చెలగాటమాడుతుందని, ప్రభుత్వం చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో దళితులు ఏకమై ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

ఇల్లందకుంట: పురుగు మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు.. మండల కేంద్రానికి చెందిన పంజాల సంపూర్ణ(41) స్వస్థలం జమ్మికుంట మండలం నాగంపేట. ఆరు నెలల నుంచి అత్తగారింట్లో ఉంటుంది. సోమవారం రాత్రి పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలికి భర్త రాజు, కుమార్తె ఉంది. తండ్రి జక్కు మొగిలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షలో ఫెయిల్ అయ్యానని మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తుల వివరాలు..సదరు విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. మంగళవారం విడుదలైన పది పరీక్షా ఫలితాల్లో తెలుగులో ఫెయిలై మిగతా సబ్జెక్టుల్లో పాస్ అయ్యాడు.దీంతో మనస్తాపం చెంది హెయిర్ డై కూల్‌డ్రింక్‌లో కలుపుకొని గ్రామ శివారులో తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు తెలిపారు.

మిల్లర్ ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరికి గాయాలు

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలంపల్లికి చెందిన మిల్లర్ కూలీలు బెజ్జంకి మండలం దేవక్కపల్లి గ్రామంలో స్లాబ్ వేసి తిరిగి వస్తుండగా మిల్లర్ ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108లో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగిందని బాధితులు వాపోయారు.

